సాక్షి
విజయనగరం
శుక్రవారం । 3 । మార్చి । 2023



చదువుకుందాం రా..!

మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. - 8లో



దర్యాప్తు వేగవంతం చేయాలి

పెండింగ్‌లో ఉన్న కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేయాలని ఎస్పీ ఎం.దీపిక పోలీస్ అధికారులను ఆదేశించారు. - 8లో



ఘనంగా ఖాదర్ బాబా గంధ మహోత్సవం

సూఫీ మహాత్మా హజరత్ షరీఫ్ ఖాదర్‌వలీ బాబా 64వ గంధ మహోత్సవం స్థానిక బాబా మెట్టలో గురువారం ఘనంగా ప్రారంభమైంది. - 8లో

న్యూస్‌రీల్

పోలింగ్ కేంద్రం తనిఖీ



పోలింగ్‌కేంద్రాన్ని తనిఖీ చేసిన జోనల్ అధికారిణి చంద్రావతి

బాడంగి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన బాడంగి జెడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల జోనల్ అధికారి బి.చంద్రావతి గురువారం తనిఖీ చేశారు. మౌలిక వసతులను పరిశీలించారు. మండలంలోని 744 మంది పట్టభద్రుల ఓటర్లకు స్లిప్‌లు అందజేయాలని సూచించారు.

డీఆర్పీ ప్రారంభం

- వైద్య విద్యార్థులకు శిక్షణ ఉత్తర్వులు అందజేసిన డీసీహెచ్ఎస్



శిక్షణ ఉత్తర్వులు తీసుకున్న పీజీ విద్యార్థులతో డీసీహెచ్ఎస్ గౌరీశంకర్

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో డిస్ట్రిక్ రెసిడెన్సీ ప్రోగ్రాం(డీఆర్పీ) గురువారం ప్రారంభమైంది. వైద్య కళాశాలల్లో పీజీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మూడు నెలలపాటు వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రుల్లో శిక్షణ పొందాల్సి ఉంది. 100 పడకలకు పైగా ఉన్న ఆస్పత్రుల్లో శిక్షణ పొందాలి. జిల్లాలోని ఎస్.కోట, గజపతినగరం, పార్వతీపురం ఏరియా ఆస్పత్రుల్లో పీజీ విద్యార్థులు శిక్షణ పొందనున్నారు. ఈ మేరకు 23 మంది విద్యార్థులకు డీసీహెచ్ఎస్ డాక్టర్ బి.గౌరీశంకర్ శిక్షణ అర్హత పత్రాలను అందజేశారు. ఆయా ఆస్పత్రుల్లోనే వీరికి భోజనం, వసతి కల్పిస్తారు.

విద్యకు తొలిప్రాధాన్యం



గరివిడిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న జెడ్పీ చైర్మన్

చీపురుపల్లిరూరల్(గరివిడి): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యకు తొలి ప్రాధాన్యమిస్తోందని, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేసి గెలిపించాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. గరివిడి పట్టణంలోని ఫేకర్ క్వార్టర్, చీపురుపల్లి పట్టణంలోని లావేరు రోడ్డులో గురువారం ప్రచారం చేశారు. నాడు–నేడు పనులు, అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీవిద్యాదీవెన పథకాల వల్ల విద్యార్థులకు కలుగుతున్న లబ్ధిని వివరించారు. సుధాకర్‌ను గెలిపిస్తే విద్యారంగానికి, చదువుకున్న యువతకు మరింత మేలు జరుగుతుందన్నారు. ఆయన వెంట గరివిడి జెడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణంనాయుడు, బమ్మిడి అప్పలస్వామి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్స్‌గా ఉద్యోగోన్నతి



ఉద్యోగోన్నతి పొందిన వారితో ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల, సూపరింటెండెంట్ డాక్టర్ అప్పలనాయుడు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న 8 మందికి ప్రభుత్వం అసోసియేట్ ప్రొఫెసర్లుగా ఉద్యోగోన్నతి కల్పించింది. వారికి రిలీవింగ్ ఆర్డర్స్‌ను వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల, సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు గురువారం అందజేశారు. ఉద్యోగోన్నతులు పొందిన వారిలో డాక్టర్ కె.కె.ఎల్ ప్రసాద్ (కమ్యూనిటీ మెడిసిన్ విభాగం), డాక్టర్ చౌదరి బాలాజీ(పెథాలజీ), డాక్టర్ తారకలక్ష్మి (ఫిజియాలజీ)లను విశాఖపట్నం ఆంధ్ర మెడికల్ కాలేజీకు బదిలీ చేశారు. డాక్టర్ శరత్ నాయక్ (కమ్యూనిటీ మెడిసిన్) విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాలకు, డాక్టర్ వినుత (ఫామ్‌కాలజీ) విజయవాడ సిద్దార్థ మెడికల్ కాలేజీకి, డాక్టర్ పి.కుసుమకుమారి, పీవీఎస్ఎస్ విజయబాబు (బయోకెమిస్ట్రీ)లను శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాలకు, జి.సూర్యనారాయణ (డెర్మాటాలజీ)ను రాజమండ్రి ప్రభుత్వ వైద్య కళాశాలకు బదిలీ అయ్యారు.

శ్రీవారి సేవకు అటవీ ఉత్పత్తులు

- శ్రీవారి సేవకు ఉమ్మడి విజయనగరం జిల్లా ఉత్పత్తులు
- స్వామి కైంకర్యానికి బెల్లం సరఫరా
- పూజాధికాలకు పసుపు, తేనె తదితర ఉత్పత్తులు
- జీసీసీ ఆధ్వర్యంలో సరుకుల ఎగుమతి



టీటీడీకి సరఫరా చేసేందుకు సిద్ధం చేసిన పసుపు



బొబ్బిలి నుంచి టీటీడీకి వెళ్తున్న సేంద్రియ బెల్లం

శృంగవరపుకోట:

ప్రత్యక్ష దైవం.. ఏడుకొండల వెంకన్నకు ఉమ్మడి విజయనగరం జిల్లాలోని కొండల్లో పండే పంటలను సమర్పించే భాగ్యం దక్కింది. జీసీసీ చరిత్రలో తొలిసారిగా అటవీ ఉత్పత్తులను శ్రీవారి సేవకు సరఫరా చేసేందుకు అనుమతులు లభించాయి. శ్రీవారి సిరి గిరిపుత్రుల ఇంట కనిపిస్తోంది. ఇప్పటివరకు ఏజెన్సీ గ్రామాల నుంచి తేనే, పసుపు తిరుమలతిరుపతి దేవస్థానానికి సరఫరా చేస్తుండగా తాజాగా బొబ్బిలి బెల్లం శ్రీవారి కైంకర్యాలకు వినియోగిస్తున్నారు. దేవస్థానం అధికారులు ఇటీవల ఇక్కడి రైతులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. బొబ్బిలి మండలంలోని మెట్టవలస, కోమటిపల్లి గ్రామాల రైతులు పూర్తిగా సేంద్రియ పద్ధతిలో చెరకును పండిస్తున్నారు. ఆ చెరకుతో గానుగల్లో బెల్లం తయారు చేస్తున్నారు. ఇందులో ఎలాంటి రసాయనాలు కలపరు. దీనిని పరిశీలించిన దేవస్థానం అధికారులు కిలో రూ.80 చొప్పున కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇప్పటికే 38 టన్నుల బెల్లాన్ని రైతులు సరఫరా చేశారు.

అభిషేకానికి అటవీ తేనె

జీసీసీ చైర్‌పర్సన్‌గా శోభా స్వాతిరాణి పగ్గాలు చేపట్టిన తర్వాత ఆమె ఇటు టీటీడీ బోర్డును, అటు అధికార యంత్రాంగాన్ని ఒప్పించి గిరిజనులు సేకరిస్తున్న స్వచ్ఛమైన తేనెను దేవదేవుని అభిషేకానికి పంపేలా అనుమతులు సాధించారు. దీంతో ఇప్పటి వరకు తేనె కిలో రూ.1800లు చొప్పున 4,300 కేజీలు పంపించారు. దీంతో స్వచ్ఛమైన తేనెను సేకరించే గిరిపుత్రులకు ఆదాయం దండిగా వస్తోంది.



జిల్లా నుంచి వ్యవసాయ ఉత్పత్తులు శ్రీవారి సేవకు వెళ్లడం ఇదే తొలిసారి.

పసుపు రైతుకు కాసుల వర్షం

కొండపోడులో పూర్తిగా సేంద్రియ పద్ధతిలో గిరిజన రైతులు పసుపును సాగుచేస్తారు. అందుకే మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంటుంది. స్వచ్ఛమైన పసుపును కిలో రూ.141.75లు పైసలకు శ్రీవారికి అందిస్తామన్న జీసీసీ విజ్ఞాపనతో టీటీడీ ఆర్డర్ ఇస్తోంది.

నాణ్యమైన ఉత్పత్తులు



అటవీ ప్రాంతంలో లభ్యమైన స్వచ్ఛమైన తేనె, నాణ్యమైన పసుపు వంటి ఉత్పత్తులను తిరుపతికి చేరవేయాలన్న ఆలోచనతో అధికారులతో మాట్లాడాను. నాణ్యత, స్వచ్ఛతను పరిశీలించి ఆర్డర్ ఇస్తున్నారు. ఇది రైతులకు కలిసివచ్చే అంశం. భవిష్యత్‌తో పెద్దస్థాయిలో ఆర్డర్లు వస్తే గిరిజన రైతులకు మేలుజరుగుతుంది. కాఫీ, కుంకుడుపొడి, శీకాయ వంటి ఉత్పత్తుల మార్కెట్‌పైనా దృష్టిసారించాం. జీసీసీ ఉత్పత్తులకు బ్రాండ్ క్రియేట్ చేస్తున్నాం.

– శోభా స్వాతిరాణి, జీసీసీ చైర్‌పర్సన్

ఇప్పటికే సుమారు 6000 కిలోలను టీటీడీకి జీసీసీ సరఫరా చేసింది. మరోవైపు నాణ్యమైన ఉత్పత్తుల మార్కెటింగ్‌పై దృష్టిసారించింది.

పంటల సాగుపై రైతుల ఆసక్తి

జిల్లా రైతాంగం పంటల సాగుపై ఆసక్తి చూపుతోంది. కొత్త రకం కొబ్బరి, మామిడి, డ్రాగన్‌ఫ్రూట్, అయిల్‌పామ్, అవకాడో, బొప్పాయి, జామ వంటి పంటలు సాగుచేస్తోంది. సేంద్రియ వ్యవసాయానికి ప్రాధాన్యమిస్తోంది. ఏటా పంటమార్పిడి చేస్తూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధిస్తోంది. ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు 'సాగు'తోంది.

● ఆశల పూత



ప్రకృతి అనుకూలించింది. జిల్లాలో మామిడి తోటలు విరగబూశాయి. చూపరులను ఆకర్షిస్తున్నాయి. నిండుగా పూసిన చెట్లు తెలుగు సంవత్సరాదికి శుభస్వాగతం పలుకుతున్నాయి. రైతుల్లో అధిక దిగుబడి ఆశలు నింపుతున్నాయి.

– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం

సారిపల్లి అటవీశాఖ కార్యాలయంలో విరగబూసిన మామిడి చెట్టు

● ఓటరు స్లిప్పుల పంపిణీ



ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ ఈ నెల 13న జరగనుంది. ఇందులో భాగంగా ఓటర్లకు ఓటరు స్లిప్పుల పంపిణీ జిల్లాలో చురుగ్గా సాగుతోంది. రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి స్లిప్పులు అందజేస్తున్నారు. విజయనగరం నాలుగోవార్డు సచివాలయం పరిధిలో తహసీల్దార్ చింతా బంగార్రాజు ఆధ్వర్యంలో స్లిప్పులు పంపిణీ చేస్తున్న సిబ్బందిని చిత్రంలో చూడొచ్చు. – విజయనగరం రూరల్

జాతర ఆదాయం రూ.18.57 లక్షలు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న దేవదాయ శాఖ సిబ్బంది, భక్తులు

రాజాం సిటీ: రాజాం పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర ఆదాయం రూ.18,57,081లు వచ్చినట్టు ఈఓ బీవీ మాధవరావు తెలిపారు. హుండీలు, టికెట్ కౌంటర్లు, విరాళాల ద్వారా సమకూరిన ఆదాయాన్ని ఆలయ ఆవరణలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ పీవీ లక్ష్మి సమక్షంలో గురువారం లెక్కించారు. గత నెల 26 నుంచి మార్చి 1 వరకు నాలుగు రోజుల జాతరలో టికెట్ కౌంటర్లు, కానుకల రూపంలో రూ.8,73,468లు, హుండీల ద్వారా రూ.9,83,613లు సమకూరిందని ఈఓ తెలిపారు. గతేడాది రూ.22,50,778లు ఆదాయం రాగా ఈ ఏడాది 3,93,697లు తగ్గినట్టు వెల్లడించారు. లెక్కింపు కార్యక్రమంలో నవదుర్గ ఆలయ ఈఓ పి.శ్యామలరావు, ఆలయ ట్రస్టీ వాకచర్ల దుర్గాప్రసాద్, అర్చకులు వేమకోటి సూర్యనారాయణశర్మ, సలాది తులసీదాస్, వెంపల లక్ష్మణరావు, భక్తులు పాల్గొన్నారు.

‘మిరాకిల్’ కబ్జా భూముల గుర్తింపు



తహసీల్దార్ శ్రీనివాసరావుతో చర్చిస్తున్న లోకం ప్రసాద్, సంస్థ సిబ్బంది, గ్రామస్తులు

భోగాపురం: మండలంలోని ముంజేరు సమీపంలోని మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ కంపెనీ కబ్జాచేసిన ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు గుర్తించారు. భూములకు రక్షణగా సిమెంట్ స్తంభాలు వేసే పనులు చేపట్టేందుకు గురువారం వెళ్లిన రెవెన్యూ సిబ్బందిని స్థానికులతో పాటు సంస్థ యాజమాన్యం అడ్డుకునేందుకు ప్రయత్నించింది. ప్రభుత్వ భూముల్లో రోడ్ల నిర్మాణాలు మాత్రమే ఉన్నాయని, తమ భూముల రక్షణకు ఈ రోడ్లు అవసరమని తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావుకు సంస్థ యజమాని లోకం ప్రసాద్ వివరించారు. ప్రభుత్వ భూముల్లో ఎటువంటి భవన నిర్మాణాలు చేపట్టలేదన్నారు. హాస్టల్లో ఉంటున్న విద్యార్థులు కాలేజీకి వెళ్లేందుకు, మా సంస్థలో పనిచేస్తున్న సిబ్బంది రాకపోకలు సాగించేందుకు మాత్రమే ప్రభుత్వ భూముల్లో రోడ్లు వేశామని చెప్పారు. ప్రభుత్వ భూముల వల్ల మాకు ఒరిగేదేమీ లేదని చెప్పుకొచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిమెంట్ స్తంభాలు వేసి సరిహద్దులు గుర్తిస్తామని తహసీల్దార్ స్పష్టంచేయడంతో చేసేది ఏమీలేక లోకం ప్రసాద్‌తో పాటు సిబ్బంది అక్కడి నుంచి వెనుదిరిగారు. స్తంభాలు వేసే కార్యక్రమాన్ని తహసీల్దార్ రేపటికి వాయిదా వేశారు.

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- 72 కేంద్రాల నుంచి వెబ్‌కాస్టింగ్
- ఎమ్మెల్సీ ఎన్నికలపై కలెక్టర్ సమీక్ష



కలెక్టర్ ఎ.సూర్యకుమారి

విజయనగరం అర్బన్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. ఎన్నికల ఏర్పాట్లపై తన చాంబర్‌లో నోడల్ అధికారులతో గురువారం సమీక్షించారు. మేన్‌పవర్, ట్రాన్స్‌పోర్టు, మెటీరియల్ మేనేజ్‌మెంట్, బందోబస్తు, వెబ్‌కాస్టింగ్, మీడియా మేనేజ్‌మెంట్, మోడల్ కోడ్ అమలు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ నెల 13న జరగనున్న పోలింగ్‌కు బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రి తరలింపునకు వాహనాలు ఏర్పాటు చేయాలన్నారు. ఐదు, అంతకంటే ఎక్కువ పోలింగ్ బూత్‌లు ఉన్నచోట అదనంగా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయాలని సూచించారు. పోలింగ్ బూత్‌లోకి మీడియాకు అనుమతి లేదని స్పష్టం చేశారు. జిల్లాలో ఏర్పాటు చేస్తున్న 72 పోలింగ్ కేంద్రాల నుంచి వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో ఎం.గణపతిరావు, ఆర్డీఓ ఎం.వి.సూర్యకళ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

గ్లోబల్ సమ్మిట్ అతిథులకు జీసీసీ గిఫ్ట్ ప్యాక్



గ్లోబల్ సమ్మిట్‌లో అతిథుల కోసం జీసీసీ సిద్ధం చేసిన గిఫ్ట్‌ప్యాక్

శృంగవరపుకోట: విశాఖపట్టణంలో శుక్ర, శనివారం జరగనున్న ఏపీ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు వచ్చే విదేశీ, స్వదేశీ అతిథులకు జీసీసీ (గిరిజన సహకార సంస్థ) గిఫ్ట్ కిట్‌లు అందనున్నాయి. నాణ్యమైన అటవీ ఉత్పత్తులతో అందమైన గిఫ్ట్ ప్యాక్‌ను జీసీసీ సిద్ధం చేసింది. ఒక్కో గిఫ్ట్ బాక్స్‌లో 12 రకాల గిరిజన ఉత్పత్తులను ఉంచింది. 250 గ్రాముల తేనె, 50 గ్రా. ఇన్‌స్టంట్ కాఫీపొడి, 50 గ్రా.ఇన్‌స్టంట్ బ్లెండ్ కాఫీ, 100 గ్రా. రోస్టెడ్ కాఫీ బీన్స్, 100 గ్రా. జీడిపప్పు, 100 గ్రా. పసుపు, 100గ్రాముల ఉసిరి క్యాండీ, కుంకుళ్లతో తయారు చేసిన 50 మి.లీ.హెయిర్ వాష్, 50మి.లీ. హ్యాండ్ వాష్, వనమూలికలతో తయారు చేసిన 50మి.లీ పెయిన్ రిలీఫ్ ఆయిల్, 50 మి.లీ హెయిర్ ఆయిల్ ఉన్నాయి. వీటిని గ్లోబల్‌మీట్‌లో అతిథులకు ఇవ్వనున్నట్టు జీసీసీ చైర్‌పర్సన్ డాక్టర్ శోభా స్వాతిరాణి తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి కోసం అహర్నిశలు కృషిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం



స్వామివారి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపిస్తున్న వేదపండితులు

డెంకాడ: చింతలవలసలోని ఏపీఎస్పీ ఐదో బెటాలియన్ వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసుని కల్యాణోత్సవం గురువారం కనులపండువగా జరిగింది. భక్తులు ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వరుడు వేంకటేశ్వరస్వామి తరపున బడ్డుకొండ మణిదీప్ దంపతులు, వధువులు అలివేలి మంగ, పద్మావతి తరపున అసిస్టెంట్ కమాండెంట్ వి.నారాయణరావు దంపతులు పాల్గొని కల్యాణోత్సవాన్ని జరిపారు. విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పద్మావతి దంపతులు, ఎంపీపీ బంటుపల్లి వెంకటసత్యవాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, బెటాలియన్ అధికారులు, భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

సంగీత కళాశాల ప్రిన్సిపాల్‌గా నాగలక్ష్మి



విజయనగరం టౌన్: మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్‌గా (ఎఫ్ఏసీ) మండపాక నాగలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ఆర్.వి.ప్రసన్నకుమారి గుండెపోటుతో మూడు రోజుల కిందట మృతిచెందిన విషయం తెలిసిందే. ఆ బాధ్యతలను నాగలక్ష్మికి అప్పగించారు.

ఉత్కంఠగా గుర్రాల పరుగు పోటీ



పోటీల్లో దౌడుతీస్తున్న గుర్రం

లక్కవరపుకోట: మండలంలోని తలారి గ్రామంలో అచ్చియ్యమ్మ పేరంటాల తీర్థం సందర్భంగా గురువారం నిర్వహించిన గుర్రాల పరుగు పందెం పోటీలు ఉత్కంఠగా సాగాయి. విజయనగరం, అనకాపల్లి జిల్లాల నుంచి 14 గుర్రాలు పోటీల్లో పాల్గొన్నాయి. మొదటి ఆరు స్థానాల్లో నిలిచిన గుర్రాలకు సంబంధించిన యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు. గ్రామస్తులు ఉదయం నుంచి అచ్చియ్యమ్మ పేరంటాలకు ప్రత్యేక పూజలు చేశారు.

టీటీసీ పరీక్ష ఫలితాలు విడుదల

విజయనగరం పూల్‌బాగ్: విశాఖపట్నం, కృష్ణ, గుంటూరు, వైఎస్సార్ కడప, అనంతపురంలో జరిగిన టీటీసీ (టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సు) ఆగస్టు–2022 పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్టు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాల కోసం www. bre.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

నా బిడ్డ పరిస్థితేంటి ?



వన్‌టౌన్ సీఐ వెంకటరావుకు ఫిర్యాదు చేస్తున్న పుష్పలత

విజయనగరం క్రైమ్: తన బిడ్డ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తూ విజయనగరానికి చెందిన అడ్వకేట్ తమ్ముడి భార్య పుష్పలత వన్‌టౌన్ పోలీసులను గురువారం ఆశ్రయించి, ఫిర్యాదుచేసింది. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకట్రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అడ్వొకేట్ తమ్ముడి భార్య పుష్పలత కొన్నాళ్ల కిందటే వాళ్ల చెర నుంచి తప్పించుకుని బయటకు వచ్చేసింది. కానీ ఆమె బిడ్డ అక్కడే ఉండిపోయింది. ఇప్పుడు తాజాగా అడ్వొకేట్ మధుసూదనరావు భార్య సుప్రియకు మెజిస్ట్రేట్, పోలీస్‌శాఖ సహకారంతో విముక్తి లభించిన సంగతి విదితమే. సుప్రియ కూడా బయటకు రావడంతో తన బిడ్డ పరిస్థితేమిటన్నది పుష్పలతకు ప్రశ్నార్థకంగా మారింది. దీంతో గురువారం ఆమె వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావును కలిసి తన గోడు వెళ్లగక్కి లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేసింది. అయితే కోర్టుద్వారా సమస్య పరిష్కరించుకోవాలని సీఐ సూచించడంతో ఆమె జిల్లా న్యాయస్థానాన్ని ఆశ్రయించింది.

దాడితల్లి సేవలో ఎమ్మెల్యే దంపతులు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి దంపతులు

బొబ్బిలి: పట్టణ పరిధిలోని గొల్లపల్లిలో దాడితల్లి ఆలయ గర్భాలయ గోపుర ప్రతిష్ఠ గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు పిండిప్రోలు మణికుమార్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు, పూర్ణకలశ ప్రతిష్ఠ, మండపారాధనలు నిర్వహించారు. ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు సతీసమేతంగా పూజల్లో పాల్గొని, దైవం పట్ల తమకున్న భక్తిశ్రద్ధలు చాటుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురికి తీవ్ర గాయాలు



క్షతగాత్రులను 108 వాహనంలో తరలిస్తున్న సిబ్బంది

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామం సమీపంలో జాతీయ రహదారి26పై గురువారం ఉదయం వేగంగా వస్తున్న కారు ఆగి ఉన్న వాహనాలపైకి ఒక్కసారిగా దూసుకెళ్లడంతో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. విజయనగరం నుంచి గజపతినగరం వైపు వస్తున్న కారు టిఫిన్ సెంటర్ వద్ద ఆగి ఉన్న ఆటోతో పాటు మోటార్ సైకిల్‌పైకి దూసుకెళ్లడంతో ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న కె.చంద్రరావు, ఆటోలో వెళ్తున్న డ్రైవర్ వి.వెంకటరమణ, కూతురు వి.లికిత శ్రీ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని 108 వాహనంలో విజయనగరంలోని సర్వజన ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. పోతాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

పాచిపెంట: మండలంలోని కన్నయ్యవలస గ్రామానికి చెందిన సోయారి ఆదయ్య విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. గతనెల 25వతేదీన చెట్టుపై నుంచి జారిపడి ఆదయ్య తీవ్రగాయపడ్డాడు, వెంటనే కుటుంబసభ్యులు సాలూరు సీహెచ్‌సీకి తరలించారు. అక్కడినుంచి అదే రోజు మెరుగైన వైద్యం నిమిత్తం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించగా చికిత్సపొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు ఈ మేరకు మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు హెచ్‌సీ కృపారావు తెలిపారు.

జిల్లా ఆస్పత్రిలో మరో యువకుడు..

విజయనగరం క్రైమ్: రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన యువకుడు జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. బొగ్గులదిబ్బ ఎస్సీ కాలనీకి చెందిన మామిడి ఉదయ్ కుమార్ (19) బుధవారం రాత్రి బైక్‌పై స్నేహితుడితో వస్తుండగా కెఎల్.పురంలోని జేఎంఎస్ కల్యాణ మంటపం సమీపంలో ప్రమాదవశాత్తు కింద పడిపోయారు. ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన ఉదయ్‌ను కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బి.వెంకటరావు తెలిపారు.

చదువుకుందాం రా..!

- జీసీ విద్యార్థులకు సువర్ణావకాశం
- గురుకులాల్లో ప్రవేశాలకు ప్రకటన విడుదల
- జిల్లాలో మూడు బాలికలు, నాలుగు బాలుర పాఠశాలలు
- 440 మందికి ఐదోతరగతిలో ప్రవేశాలకు అవకాశం
- వచ్చే నెల 4వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

జిల్లాలో గురుకులాల వివరాలు

పాఠశాల	సీట్ల సంఖ్య
నెల్లిమర్ల(బాలికలు)	80
నెల్లిమర్ల(మత్స్యకార బాలురు)	40
గజపతినగరం(బాలురు)	80
గంట్యాడ(బాలికలు)	80
విజయనగరం(బాలురు)	40
కొత్తవలస(బాలికలు)	40
బొబ్బిలి(బాలురు)	80



నెల్లిమర్లలోని బాలికల గురుకుల పాఠశాల

నెల్లిమర్ల: మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. జిల్లావ్యాప్తంగా ఏడు ప్రాంతాల్లో మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలున్నాయి. వాటిలో మూడు బాలికల పాఠశాలలు కాగా, నాలుగు బాలుర పాఠశాలలు. ఆయా పాఠశాలల్లో ఐదో తరగతిలో మొత్తం 440 సీట్లు భర్తీ చేయనున్నారు. నెల్లిమర్ల బాలికలు, గజపతినగరం బాలురు, గంట్యాడ బాలికలు, బొబ్బిలి బాలుర పాఠశాలల్లో 80 చొప్పున సీట్లు అందుబాటులో ఉన్నాయి, నెల్లిమర్ల మత్స్యకార బాలురు, విజయనగరం బాలురు, కొత్తవలస బాలికల పాఠశాలల్లో 40 చొప్పున సీట్లున్నాయి.

ప్రతిభ ఆధారంగానే ప్రవేశాలు

ఆయా పాఠశాలల్లో ప్రవేశాలకు గత ఏడాది లాటరీ పద్ధతి ద్వారా విద్యార్థులను ఎంపికచేయగా, 2023-24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ప్రతిభా పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్ష 4వ తరగతి స్థాయిలో ఉంటుంది. తెలుగు, ఇంగ్లీషు, లెక్కలు, సైన్స్, సోషల్ సబ్జెక్టులపై 50 మార్కులకు ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలుంటాయి. తెలుగు-10, ఇంగ్లీషు-10, లెక్కలు-15, సైన్స్, సోషల్ కలిపి 15 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. పరీక్షకు రెండు గంటల సమయం కేటాయిస్తారు. విద్యార్థులు జవాబులను ఓఎంఆర్ షీట్‌లో గుర్తించాల్సి ఉంటుంది. జిల్లా అంతా ఒక యూనిట్‌గా ప్రవేశాలకు ఎంపిక నిర్వహిస్తారు.

దరఖాస్తు చేసుకోవడానికి అర్హతలు

గురుకులాల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ప్రస్తుత విద్యా సంవత్సరంలో నాలుగో తరగతి చదువుతూ ఉండాలి. ఈ జిల్లాలోని ఏదైనా ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో నిరంతరాయంగా చదివి ఉండాలి. బీసీ, ఈబీసీ విద్యార్థులు 1.9.2012-31.8.2014 మధ్య జన్మించి, 9నుంచి 11 సంవత్సరాల మధ్య వయసు వారై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 1.9.2010-31.8.2014 మధ్య జన్మించి, 9 నుంచి 13 సంవత్సరాల వయసు వారై ఉండాలి. విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకుల సంవత్సర ఆదాయం ఏడాదికి రూ లక్షకు మించరాదు.

సీట్ల భర్తీలో రిజర్వేషన్లు ఇలా

పాఠశాలల్లోని మొత్తం సీట్లలో 74 శాతం బీసీ కులాలకు చెందిన విద్యార్థులకే ప్రభుత్వం కేటాయించింది. బీసీ-ఎ విద్యార్థులకు 20శాతం, బీసీ-బీ విద్యార్థులకు 28 శాతం, బీసీ-సీ విద్యార్థులకు 3 శాతం, బీసీ-డీ విద్యార్థులకు 19 శాతం, బీసీ-ఈ విద్యార్థులకు 4 శాతం సీట్లు కేటాయించారు. ఎస్సీ విద్యార్థులకు 15శాతం, ఎస్టీ విద్యార్థులకు 6శాతం, అనాథ విద్యార్థులకు 3 శాతం సీట్లు ఈబీసీ/ఇతర కులాల విద్యార్థులకు 2 శాతం రిజర్వ్ చేశారు. మత్స్యకార బాలుర పాఠశాలలో 46 శాతం సీట్లను మత్స్యకార విద్యార్థులతోనే భర్తీచేస్తారు. 29 శాతం సీట్లను బీసీ కులాలకు చెందిన విద్యార్థులకు, 15 శాతం సీట్లను ఎస్సీ, 6శాతం సీట్లను ఎస్టీ, 3శాతం అనాథ విద్యార్థులకు, 1 శాతం ఈబీసీ, ఇతర కులాల విద్యార్థులకు కేటాయించారు.

ఎలా దరఖాస్తు చేసుకోవాలి?

గురుకులాల్లో ప్రవేశాలకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. పేరు, పుట్టిన తేదీ, తండ్రి/సంరక్షకుడి మొబైల్ నంబరు తదితర ప్రాథమిక వివరాలతో పాటు రూ.100 చెల్లిస్తే జర్నల్ నంబర్ వస్తుంది. ఆ నంబర్ ఆధారంగా హెచ్‌టీటీపీఎస్://ఎంజేపీఏపీబీసీడబ్ల్యుఆర్ఈఐఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు పంపిన తరువాత వచ్చే రిఫరెన్స్ నంబరుతో దరఖాస్తు నమూనా కాపీని ప్రింట్ తీసుకోవాలి. పాఠశాలలకు నేరుగా అందజేసే దరఖాస్తును పరిగణనలోకి తీసుకోరు. ఈనెల 5 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశముంది.

అవకాశాన్ని వినియోగించుకోవాలి



జిల్లాలోని ఎంజేపీఏపీ గురుకుల పాఠశాలలు పదోతరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నాయి. నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నాం. పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియంలో ఐదో తరగతిలో ప్రవేశాలకు ప్రకటన విడుదల చేశాం. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రతిభ పరీక్ష ఆధారంగానే ఐదో తరగతిలో ప్రవేశాలు కల్పిస్తాం. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ నెల 5 నుంచి వచ్చే నెల 4వ తేదీవరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

– కేబీబీ రావు, గురుకులాల జిల్లా కన్వీనర్, విజయనగరం

ఏడు ఇసుక ట్రాక్టర్ల సీజ్



పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

బొండపల్లి: అనుమతులు లేకుండా అక్రమంగా ఏడు ట్రాక్టర్లతో తరలిస్తున్న ఇసుకను మండలంలోని నెలివాడ జంక్షన్ సమీపంలో పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై ఎస్.రవి తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గజపతినగరం మండలం మీదుగా జాతీయ రహదారి26పై గురువారం సాయంత్రం ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా అడ్డుకుని స్టేషన్‌కు తరలించి సీజ్ చేసినట్లు చెప్పారు. తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత అధికారులకు అప్పగించనున్నామన్నారు.

ఇన్‌చార్జ్ ఏఈ సస్పెన్షన్

విజయనగరం ఫోర్ట్: బొబ్బిలి డి-2 సెక్షన్ జూనియర్ ఇంజినీర్, ఇన్‌చార్జి ఏఈ జి.శివశంకర్‌రావుపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు విద్యుత్‌శాఖ ఎస్ఈ పి.నాగేశ్వరరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఎవరికైనా విద్యుత్ పోల్ కావాలంటే నిబంధనల ప్రకారం రూ.1,28,451 చెల్లించాల్సి ఉంది. విద్యుత్ పోల్‌ను తరలించాలంటే దానికి సంబంధించి ఎస్టిమేట్, తరలించడానికి చార్జీలకు సంబంధించి ఎస్టిమేట్ వేసి ఉన్నతాధికారులకు పంపించాలి. విద్యుత్ పోల్‌కు సంబంధించిన పేమెంట్ సదరు వ్యక్తి చెల్లించిన తర్వాత, ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని పోల్ తరలించాలి. కానీ ఇన్‌చార్జ్ ఏఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయకుండా..నిబంధనలకు విరుద్ధంగా బొబ్బిలిలోని సాహితినగర్‌లో ఉంటున్న మరడా శంకర్‌రావుకు 33 కేవీ పోల్‌ను అనధికారికంగా తరలించారు.అంతేకాకుండా పోల్ తరలించే సమయంలో ఉదయం 10:06 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేసి వినియోగదారులకు ఇబ్బంది కలిగించారు. దీంతో ఆయనపై సస్పెన్షన్ వేటు పడింది.

మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.సూర్యకుమారి

- కలెక్టర్ ఎ.సూర్యకుమారి

విజయనగరం అర్బన్:

మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. మహిళా దినోత్సవం నిర్వహణలో భాగంగా మానవహారం, బాల్య వివాహాల నిరోధంపై వీధినాటికల ప్రదర్శన, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. 9వ తేదీన మండల స్థాయిలో మానవహారాలు, మహిళా దినోత్సవం నిర్వహించాలని చెప్పారు. అందుకు గాను మండలాల్లో 6వ తేదీన సఖి గ్రూపు సభ్యులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి, 9వ తేదీన బహుమతి ప్రదానం చేయాలని కలెక్టర్ సూచించారు. మహిళా దినోత్సవం సందర్భంగా బాల్య వివాహాల నిరోధంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ డాక్టర్ ఎం.అశోక్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఆర్.శ్రీరాములునాయుడు, డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి, మెప్మా పీడీ సుధాకరరావు, ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి, డీఈఓ బీ.లింగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పోక్సో కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలి

- నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ ఎం.దీపిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఎం.దీపిక



పాల్గొన్న పోలీస్ అధికారులు

విజయనగరం క్రైమ్: పెండింగ్‌లో ఉన్న పోక్సో, గ్రేవ్ కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేయాలని ఎస్పీ ఎం.దీపిక పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా పోలీసు అధికారులతో వార్షిక నేర సమీక్షా సమావేశాన్ని జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిందితులకు 41 సీఆర్‌పీసీ నోటీసులిచ్చే సమయంలో సుప్రీంకోర్టు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కొన్నింటిని ప్రాధాన్యత కేసులుగా గుర్తించి, ఆయా కేసుల్లో ప్రాసిక్యూషన్ త్వరితగతిన పూర్తిచేసి, నిందితులకు తప్పనిసరిగా, త్వరగా శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ నెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఎస్ఈబీ అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ఇన్చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, దిశ మహిళా డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ డీఎస్పీ ఎల్.మోహనరావు, ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, న్యాయ సలహాదారులు వై.పరశురాం, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేశవరావు సీఐలు, ఎస్సైలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఖాదర్ బాబా గంధ మహోత్సవం



మహాన్నదాన క్రతువు ప్రారంభిస్తున్న డాక్టర్ ఖలీలుల్లా షరీఫ్



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న నిర్వాహకులు

విజయనగరం టౌన్: సూఫీ మహాత్మా హజరత్ షరీఫ్ ఖాదర్‌వలీ బాబా 64వ గంధ మహోత్సవం స్థానిక బాబామెట్టలో గురువారం ఘనంగా ప్రారంభమైంది. నఖీబుల్ ఔలియా సూఫీ పీఠాధిపతి హజరత్ మహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా ఖాదరీ బాబా ఆధ్యాత్మిక వారసులు సజ్జాద నషీన్ మహమ్మద్ ఖాజా మెహియుద్దీన్ షా, విజయనగరం ఖాదరి బాబా దర్గా దర్బార్ ముతవల్లి డాక్టర్ ఖలీలుల్లా షరీఫ్, ఎం.డి జాఫర్ షరీఫ్‌లు ఉర్సు మహోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దర్బార్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఫకీర్ మేళాలతో ఊరేగింపుగా బాబా చాదర్, సుగంధ పరిమళ ద్రవ్యాలతో, పూలమాలలతో బాబా దర్గాకు భక్తుల కోలాహలం మధ్య బయల్దేరారు. అక్కడ చాదర్ సమర్పించి, ఉరుసు ఉత్సవాల ప్రారంభ సూచికగా జెండా మహోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఆలయం ఆవరణలో ప్రత్యేక పూజలు, మహాన్నదాన క్రతువు చేశారు. వందలాది మంది భక్తులు పాల్గొని, బాబా ప్రసాదాన్ని స్వీకరించారు.

ఆహార పదార్థాల తయారీ తనిఖీ



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

పార్వతీపురం: పార్వతీపురం పట్టణంలోని వివిధ హోటల్స్, మిఠాయి దుకాణాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో జిల్లా ఆహార భద్రతాధికారులు గురువారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిషేధించిన రంగులు, టేస్టింగ్ సాల్ట్‌ను వాడకూడదని ఆహార భద్రత అధికారి పి. వెంకట రమణ హెచ్చరించారు. కాచిన నూనెలలో టీపీసీ(టోటల్ పోలార్ కాంపౌండ్స్)ను పరిశీలించి దుకాణదారులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. వంట నూనెలు అతిగా మరగకాచడం వల్ల ఉదరకోశ వ్యాధులు వస్తాయని స్పష్టం చేశారు.

స్మార్ట్ క్లాస్ శిక్షణా తరగతులు ప్రారంభం



స్మార్ట్‌క్లాస్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించి, సూచనలిస్తున్న డిప్యూటీ డీఈఓ తిరుపతి నాయుడు

రాజాం సిటీ: ఉపాధ్యాయులకు అందిస్తున్న శిక్షణలో నేర్పించే అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని డిప్యూటీ డీఈఓ ఎస్.తిరుపతినాయుడు సూచించారు. స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాలలో స్మార్ట్ క్లాస్ శిక్షణా తరగతులను గురువారం ప్రారంభించిన ఆయన విద్యార్థులకు బోధన సులభతరం చేసేందుకు స్మార్ట్ క్లాసులు ఎంతగానో దోహదపడతాయన్నారు. త్వరలో రాజాంలోని 13 ప్రభుత్వ పాఠశాలల్లో వీటిని అమలు చేస్తామన్నారు. సీఆర్‌పీలతో పాటు ఒక్కో పాఠశాల నుంచి ఒక్కో ఉపాధ్యాయుడు చొప్పున ఈ తరగతులకు ఎంపిక చేసి, శిక్షణ ఇస్తున్నామన్నారు. నియోజకవర్గం లో 37 పాఠశాలల్లో స్మార్ట్ క్లాసులు అమలు చేయనున్నామన్నారు. రేగిడిలో 9, వంగరలో 7, సంతకవిటిలో 8 పాఠశాలల ఉపాధ్యాయులకు ఆయా మండలాల్లోనే శిక్షణ అందిస్తామన్నారు. ఇప్పటికే జిల్లాలో 75 పాఠశాల్లో స్మార్ట్ క్లాసులు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. పాఠాలను యానిమేషన్ రూపంలో వివరిస్తూ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా చెప్పడమే ఈ విధానం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ విధానం విద్యార్థుల విద్యా ప్రగతికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్, ఎంఈఓ పి.నాగయ్య, ట్రైనర్ యతేంద్ర, టెక్నిషియన్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం



గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్న అధికారులు

విజయనగరం రూరల్: కార్పొరేషన్ పరిధిలోని ఫూల్‌బాగ్ కాలనీలో అక్రమంగా నిల్వచేసిన పీడీఎఫ్ బియ్యాన్ని పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్ జగన్నాథరావు గురువారం స్వాధీనం చేసుకున్నారు. కాలనీకి చెందిన బత్తుల సంతోష్‌కుమార్ కిరాణా దుకాణం వద్ద 9.48 క్వింటాల పీడీఎఫ్ బియ్యం నిల్వ ఉన్నాయన్న సమాచారం అందుకున్న సీఎస్‌డీటీ జగన్నాథరావు దాడి చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సంతోష్ కుమార్‌పై కేసు నమోదు చేశారు.

8 గ్యాస్ సిలిండర్లు..

మండలంలోని చెల్లూరు గ్రామంలో గల కామత్ హోటల్లో పౌరసరఫరాల అధికారులు, విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేసి గృహ అవసరాలకు వినియోగిస్తున్న 8 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అధికారుల తనిఖీ సమయంలో గృహ అవసరాలకు వినియోగించాల్సిన గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగించడాన్ని గుర్తించారు. అలాగే బొడ్డవలస మూన్‌లైట్ దాబాలో ఐదు సిలిండర్లు, ఐనాడ వద్ద ఆరు, సిలిండర్లను గుర్తించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సీఐ సింహాచలం, విజయనగరం సీఎస్‌డీటీ వీవీఆర్ జగన్నాథం, విజిలెన్స్ కానిస్టేబుల్ పురుషోత్తం, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	56,150-00
బంగారం(22కి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹117	₹204	₹ 214